క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ గెలుపే అందరి లక్ష్యం



సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సూచనలిస్తున్న రామ్మోహనరెడ్డి

సింధియా: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ప్రజలు మళ్లీ ఎన్నుకోడానికి ఇష్టపడుతున్నారని వైఎస్సార్‌సీపీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శనివారం 63వ వార్డు కాకరలోవలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గత నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్ర ప్రభుత్వ పనితీరు అమోఘంగా ఉందన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి వాటిని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు సోమాదుల సురేష్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొట్నాన రవి, సూరాడ పెంటారావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాల వసూలు



ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ దిగువ రోడ్డులో తనిఖీల కోసం నిలిపిన ఆటోలు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్‌లో ఆటోలపై కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. పెండింగ్‌లో ఉన్న ఈ చలానాల వసూలుకు చర్యలు చేపట్టారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ దిగువ రోడ్డులో ఆటోలకు ఎంతెంత ఫైన్లు పెండింగ్ ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి విడిచిపెడుతున్నారు. కట్టని వారి నుంచి వసూలు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



విమానాశ్రయంలో చంద్రశేఖర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు, అభిమానులు

గోపాలపట్నం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుని రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్టీల్ ప్లాంట్ ఉద్యమ నాయకులతో చర్చించి వారికి తెలుపుతామన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ర్యాలీగా నగరంలోకి వెళ్లారు.

వ్యాన్ ఢీకొని గాయపడిన వృద్ధురాలి మృతి

సీతమ్మధార: వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధురాలు మొక్క కొండమ్మ(70) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. 24వ వార్డు గాంధీనగర్‌కు చెందిన కొండమ్మ రోడ్డు దాటుతుండగా.. నక్కవానిపాలెం పోస్ట్ ఆఫీస్ వైపు నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో వృద్ధురాలు తీవ్ర గాయాల పాలైంది. చికిత్స నిమిత్తం ఆమెను కుమారుడు కేజీహెచ్‌కు తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం కొండమ్మ మరణించింది. కుమారుడు అప్పల సూరిబాబు ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రత్నం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంచిని గుర్తించండి.. జగనన్నను ఆశీర్వదించండి

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



62వ వార్డులో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ నాయకులు



గౌరీనగర్‌లో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బీఎస్ కృష్ణ, మారుతి, శ్రీదేవి వర్మ



40వ వార్డులో ప్రజలకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: 'పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారు. ఆయన చేస్తున్న మంచిని గుర్తించండి.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ మీరంతా ఆశీర్వదించండి' అని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 58వ వార్డులోని పాత్రుడు కాలనీలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు – నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. కార్పొరేటర్ గులిగిందల లావణ్య, గృహసారథులు, కన్వీనర్లతో ఆనంద్‌కుమార్ కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలన, నవరత్నాలు ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఆ పథకాల వల్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అని ప్రజలతో మాట్లాడారు. పాలన సంతృప్తి అనిపిస్తే జగనన్న వెంట నిలవాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనన్నారు. చంద్రబాబు మాదిరిగా మాట తప్పడం.. అయనకు చేత కాదన్నారు. తనను నమ్ముకున్న ప్రజలకు మేలు చేయాలన్నదే జగన్ సంకల్పమని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రజలు గుర్తించాలని కోరారు. ప్రభుత్వ పాలన బాగుంది అనుకుంటే 8286082960 నంబర్‌కు కాల్ చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చక్కటి సందేశం ఆలకించాలన్నారు. 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు చైర్మన్ ఆల్లా కృష్ణ, డైరెక్టర్ తోనంగి వెంకట రమణియాదవ్, ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు.

గౌరీ నగర్‌లో..

గోపాలపట్నం: జగనన్న ప్రభుత్వంతోనే మా భవిష్యత్తు ఉందని 52వ వార్డు ప్రజలు చెబుతున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ అన్నారు. గౌరీ నగర్‌లో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయనతో పాటు సింహాచలం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, జియ్యాని మారుతి ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందించిన పథకాల కరపత్రాలు అందించారు. ఇంటి యజమానితో 5 ప్రశ్నలకు సమాధానాలు అడిగి వాటిని నింపారు. అధిక శాతం జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని చెబుతున్నారని ఆయన తెలిపారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డులోని దుర్గానగర్, త్రినాథపురం, ఎస్సార్‌కాలనీ తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమం శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి

సింధియా: ప్రజా సంక్షేమమే పరమావధిగా.. ఎటువంటి అవినీతికి తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 40వ వార్డు ఏకేసీ కాలనీ–2 సచివాలయం(1086321) పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 62వ రోజు ఉత్సాహంగా సాగింది. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా ట్రేడ్ యూనియన్ నాయకుడు కలిదిండి బద్రీనాథ్‌లతో కలిసి ఆయన 250 గడపలను సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటి గోడలకు జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను అతికించారు. ఇళ్లకు వస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నాలుగేళ్ల సీఎం జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి దిగ్విజయంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, వైఎస్సార్‌సీపీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల్లా కృష్ణ, 90వ వార్డు నాయకుడు నమ్మి శ్రీను, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు చంటిబాబు, వరపల మహేష్, సోమాదుల సురేష్, మీసాల సత్యనారాయణ, వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ బాబే ఆదుకున్నారు



నా భర్త శంకరరావుకు పక్షవాతం వచ్చి మంచాన పడ్డాడు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా భర్తకు కార్పొరేట్ ఆస్పత్రి పైసా ఖర్చు లేకుండా వైద్యం చేయించాను. అలాగే నా భర్తకు ప్రభుత్వం పింఛన్ ఇస్తుంది. నా వ్యాపారానికి జగన్‌బాబు ప్రతి ఏటా పది వేలు సాయం అందిస్తున్నాడు. ఇంతకంటే మేలు ఏ నాయకుడు చేయగలడు చెప్పండి.

– టి.రమణమ్మ, పాత్రుడు కాలనీ

బతికున్నంత వరకు జగన్ వెంటే



ఆసరా పథకం ద్వారా మూడేళ్ల నుంచి సాయం అందుకుంటున్నాను. అలాగే ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారేసరికే పింఛన్ ఇంటికి వలంటీర్ల ద్వారా అందజేస్తోంది. చేయూత పథకం ద్వారా జగన్‌బాబు సాయం అందిస్తున్నాడు. నా మనమడి చదువుకు జగన్ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇచ్చాడు. నేను బతికి ఉన్నంత కాలం జగన్ వెంటే ఉంటాను.

– బేత సూర్యకళ, పాత్రుడు కాలనీ

ప్రజలకు మంచి చేయాలన్నదే సీఎం తపన



నవరత్న పథకాల ద్వారా పేద ప్రజలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. ఇంకా పేదలకు ఏదైనా చేయాలని తపిస్తున్నారు. అందులో భాగంగా వారి సంక్షేమం కోసం మరిన్ని మంచి కార్యక్రమాలతో త్వరలో మన ముందుకు జగనన్న వస్తారు. మీ బిడ్డలా బావించి మీరంతా ఆశీర్వదించాలి.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలపై మహిళలకు శిక్షణ

మురళీనగర్: గల్ఫ్ దేశాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. కనీసం 5వ తరగతి అర్హత కలిగి చదవడం, రాయడం తెలిసి ఉన్న 18 నుంచి 45 ఏళ్ల వయసు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని కొందరు మహిళలు ఉపాధి కోసం నకిలీ ఏజెంట్ల మోసాల వలలో చిక్కుకుని సరైన అర్హతలు, పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లి అక్కడి చట్టాలు తెలియక మోసపోయి ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, వైఎస్సార్ కడప జిల్లాల్లో హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ వంటి కోర్సుల్లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ శిక్షణలో భాగంగా విదేశాల్లోని మతపరమైన సంస్కృతీ సంప్రదాయాలు, వారి జీవన విధానాలు, అలవాట్లు వంటి ముఖ్యమైన అంశాల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు ఆయా దేశాల చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.


శిక్షణ అనంతరం మహిళలకు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఉపాధి పొందడానికి వెళ్లిన ఉద్యోగికి అక్కడ జీతభత్యాల చెల్లింపు, పనిచేసేటప్పుడు ఏమైనా ఇబ్బందులు తలెత్తిన సందర్భంలో భారత రాయభార కార్యాలయం బాధ్యత తీసుకుని తగిన సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. వివరాలకు అసోసియేట్ మేనేజర్ కార్తీక్ 94942 02677 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. https://kaushalmahotsav.nsdcdigital.org/International/Candidate/ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. మేళతాళాల మధ్య అర్చకులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. వెంకన్న స్వామికి అభిషేకాల అనంతరం ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన సమర్పించారు. నారాయణ సేవంలో భాగంగా మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పూజా కార్యక్రమాల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మణిహారం

- కేజీహెచ్ గడియారానికి 200 ఏళ్లు
- బ్రిటీష్ కాలంలో ఏర్పాటు
- ప్రత్యేక శ్రద్ధతో సంరక్షిస్తున్న అధికారులు



గడియారం రిపేర్ చేయిస్తున్న అధికారులు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ వైపు చూడగానే మనకు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది బ్రిటిష్ కాలం నాటి గడియారం. లండన్ నుంచి తీసుకొచ్చిన ఈ గడియారానికి సుదీర్ఘ చరిత్రే ఉంది. ఆస్పత్రికి మణిహారంలా భాసిల్లే ఈ గడియారాన్ని నాటి బ్రిటిష్ పాలకులు దాదాపు 200 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే అంత పురాతనమైనది అయినా కూడా ఈ గడియారం ఇప్పటికీ పని చేసేలా ఆస్పత్రి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఘన చరిత్ర కలిగిన ఈ గడియారం గతంలో ఒకసారి 40 ఏళ్ల పాటు మరమ్మతులకు గురై తిరగకుండా మొరాయించింది. దీంతో 1985లో ఆస్పత్రి అధికారులు స్థానిక వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్‌కు దీని మరమ్మతు బాధ్యతలు అప్పగించారు. దీన్ని ఛాలెంజ్‌గా తీసుకున్న ఆయన ఆగిపోయిన ఈ గడియారం పనిచేసేలా చేసి అధికారుల మన్ననలు పొందారు. అప్పటి నుంచి గడియారం పర్యవేక్షకుడిగా ఆయనకే బాధ్యతలు అప్పగించారు. గడియారం నిరంతరం పని చేసేందుకు టైమ్ మిషన్లు ఏర్పాటు చేశారు. హుద్‌హుద్ సమయంలో గడియారంలోని ముళ్లు విరిగిపోయాయి. గడియారం కూడా దెబ్బతింది. దీంతో వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్, ఆయన తనయుడు జపురుల్లా ప్రత్యేకంగా ముళ్లు తయారు చేసి అమర్చారు. ఈ గడియారంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇందులోని నిమిషాల ముళ్లు పొడవు 4 మీటర్లు, గంటల ముళ్లు పొడవు 3.5 మీటర్లు కాగా.. అంకెలన్నీ ఇనుముతో తయారయ్యాయి. చతురస్రాకారంలో గడియారం చుట్టూ గ్లోసమ్ బోర్డు అమర్చారు. రాత్రివేళ కనిపించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గడియారం పర్యవేక్షణకు ఏటా రూ.13 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. దీన్ని పెంచాలని వాచ్‌మేకర్ కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. శనివారం కాన్వెంట్ జంక్షన్ నుంచి జ్ఞానాపురం వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో మల్లారెడ్డి ప్రసాద్ అనే వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్లు, కండక్టర్ల శిక్షణపై ఆరా



డిపో సిబ్బందితో మాట్లాడుతున్న అప్పలనాయుడు

మద్దిలపాలెం: సురక్షిత ప్రయాణానికి ప్రజా రవాణా వ్యవస్థ లక్ష్యంగా ప్రతి ఒక్క డ్రైవర్, కండక్టర్ విధులు నిర్వహించాలని ఏపీ ప్రజా రవాణా వ్యవస్థ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ అప్పలనాయుడు అన్నారు. మద్దిలపాలెం సిటీ డిపోను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డిపోలో డ్రైవర్ల, కండక్టర్ల విధులు నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజా రవాణా వ్యవస్థ ను ఆశ్రయించే ప్రతి ఒక్క ప్రయాణికుడు క్షేమం సిబ్బంది బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఇంధన పొదుపు పాటించాలని సూచించా రు. సమాజ హితం కోసం సుశిక్షితులైన డ్రైవర్ల ను తయారు చేయడానికి నిష్ణాతులైన వారితో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అరుణకుమారి, అసిస్టెంట్ మేనేజర్ బిందు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధి బీజీఎం పాత్రుడు కాలనీలో జీవీఎంసీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, బోరుబావిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి జీవీఎంసీ నిధులతో సీసీ రోడ్డు వేశామన్నారు. వేసవిలో ఇక్కడ ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడకుండా కోరమాండల్ సహకారంతో ఇక్కడ బోరుబావి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సీఆర్ఎస్ ప్రతినిధి వెంకటరమణ, వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు గులిగిందల కృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ తోనంగి వెంకటరమణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పాత్రుడు కాలనీకి చెందిన పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ సౌజన్యంతో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు ఉపయుక్తంగా కోరమాండల్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కోరమాండల్ డీజీఎం శ్రీనివాసరావు,నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో ఆడారి ఆనంద్‌కుమార్



గోపాలపట్నంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పలు చర్చిల పాస్టర్లు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని స్పిరిట్ ఆఫ్ యూనియన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వార్డు పురవీధుల్లో శిలువ ధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ర్యాలీ చేపట్టారు. పాస్టర్ చింతాప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పశ్చిమ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, మల్కాపురం సీఐ లూథర్‌బాబులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ క్రీస్తు శిలువ మార్గం, శిలువలో పలికిన ఏడు మాటలు ద్వారా క్షమా గుణం, బాధ్యత, ప్రేమ, దయా గుణం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో 40, 61వ వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, కొణతాల సుధ, నాయకులు పీలా మాధవి, దాడి సత్యనారాయణ, గుడాల బాబూరావు, పాస్టర్లు, క్రైస్తవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంక్ సెంటర్ వరకు శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఐజీఎం నేతృత్వంలో ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి వేపగుంట వరకు ఉన్న పలు చర్చిల సంఘ కాపరులు, క్రైస్తవులు ర్యాలీ చేశారు. స్తుతి గీతాలు, ప్రత్యేక ప్రార్థనలు, బైబిల్ పఠనాలు చేస్తూ భక్తి తత్వాన్ని ప్రహోదించారు. కార్యక్రమంలో జయప్రకాష్ నగర్ ఎరుసలేమ్ చర్చ్ సంఘ కాపరి సిస్టర్ పీస్ ఏంజిల్ బ్లెస్సీ, పలు చర్చిల పాస్టర్లు డేవిడ్ రాజు, ఏలివాడ డేవిడ్ పాల్ బీఎస్, ప్రసాద్, కేఎల్ సుధాకర్, నేతాజీ శ్యామ్, వివిధ సంఘాల నుంచి మహిళలు, యువకులు, సండే స్కూల్ పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకలకు సర్వం సిద్ధం

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకునే పాస్కా (ఈస్టర్) వేడుకలు ఆదివారం జరగనున్నాయి. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారు. గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు రాత్రి 12 గంటల తర్వాత ఏసుక్రీస్తు సమాధి నుంచి బయటికి వస్తారని క్రైస్తవులు విశ్వసిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణ గిరిలో శనివారం రాత్రి నుంచి జాగరణ, దివ్య పూజాబలులు, ప్రార్థనలు నిర్వహించారు. రక్షకుడైన క్రీస్తును జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ దివ్యపూజా బలులు సమర్పిస్తామని సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయ చర్చి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు.

శాస్త్రీయ సంగీతంపై వర్క్‌షాప్



శాస్త్రీయ సంగీతంపై అవగాహన కల్పిస్తున్న ద్వారం త్యాగరాజు, మండపాక శారద

సీతంపేట: విమల కృష్ణ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకురాలు మండపాక శారద ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం శాస్త్రీయ సంగీతంపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ముఖ్య అతిథి సంగీత విద్వాంసుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు సంగీత త్రిమూర్తుల చిత్రపటానికి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రముఖ సంగీత విద్వాంసుడు ద్వారం భావనారాయణ స్వరపర్చిన శాస్త్రీయ సంగీత రచనలపై అవగాహన కల్పించారు. భావనారాయణ రచించిన పలు కీర్తనలు పాడి వినిపించి అందులోని సంగతులు వివరించారు. మండపాక శారద మాట్లాడుతూ ఆదివారం కూడా వర్క్‌షాప్ కొనసాగుతుందని, తిరుమల రామానుజ సూరి స్వరపర్చిన లలిత గీతాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ముందుగా ద్వారం భావనారాయణ, ద్వారం త్యాగరాజుల విశిష్టతను, గొప్పతనాన్ని సభికులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో పలువురు సంగీత కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు



తిరువీధి ఉత్సవంలో హనుమత్ సమేత సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలు

అల్లిపురం: బంగారుమెట్ట శ్రీరామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా హనుమత్, సీతారామలక్ష్మణ విగ్రహాలను తిరువీధి ఉత్సవంగా బంగారుమెట్ట, కుమ్మరవీధి, నీలమ్మవేపచెట్టు ప్రాంతాల్లో మంగళవాయిద్యాలు, మహిళల కోలాటాలతో సందడిగా నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులకు భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా సమాజం అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాజం కార్యవర్గ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.